కథానిక

# తిరిగివచ్చిన సిద్ధార్థుడు

క్షేమేంద్ర

బాగా డబ్బున్నవాళ్ళకిందట, ఆంట్‌వెర్ప్‌లో హార్బరుదగ్గరే క్వీన్స్ హోటలని వుండేది. ఒక మార్చినెల సాయంత్రం దిగులుగా నడిచొచ్చాడు యువకుడొకతను, ప్రపంచంలో కల్లా తను ఒక్కడే అన్నంత ఏకాకిభావం అతన్ని వేధిస్తూండగా. ఎవరితో చెప్పుకోవాలి తన వేదన? అందరి దృష్టిలోనూ తను అదృష్టవంతుడు, చూసి అసూయించతగిన వాడూను.

అతను రచయిత. అఖండవిజయం అందుకుంది అతని మొదటిపుస్తకం. ప్రజానీకం విమర్శకలోకం ఏకంగా ఆకాశానికెత్తేశారు దాన్ని. అంతదాకా బీదతనంతో కొట్టుమిట్టాడి ఒక్కసారి కావలసినంత డబ్బు కళ్ళజూచాడు. తన అనుభవాల్ని పురస్కరించుకునే తన పుస్తకంలో పేదలపాట్లు వర్ణించాడు. దాంతో ఒక్కమారుగా పేరున్న సంస్కర్తలు ఉన్నత వంశీయులు స్త్రీ పురుషులు తనకి పరిచయమయ్యారు. తను పెళ్ళాడిందికూడా ఉన్నతకుటుంబంలోనే; తనని ఆరాధించే అందమైన యువతి తన భార్య.

అతను తన భార్యతోకూడా ఇటలీ పోతున్నాడు. అక్కడే తన రెండోపుస్తకం పూర్తి చేస్తాడు. ముప్పాతికమూడువంతులు పూర్తయిన దాని రాతప్రతి తన సూట్‌కేస్‌లో వుంది. బ్రస్సెల్సులో చిన్ననాడుచదువుకున్న బడి చూడాలని అతని పెళ్ళాం కొన్నిరోజులు ముందుగానే బయలుదేరింది. ఈపాటికి ఆంట్‌వెర్ప్ చేరుకుని క్వీన్స్ హోటల్లో తనకోసం యెదురుచూస్తూంటుంది.

ఇదంతా బాగానేవుందే, ఇంకా విచారమెందుకు? అక్కడేవుంది అసలు విషయం. పరిస్థితుల నిజస్వరూపం వేరు. నీకు కనిపించే బాహ్యరూపానికీ దానికీ ఎక్కడా పోలికుండదు. పైగా తన విషయంలో రెంటికీ సరిగ్గా వైరుధ్యం. ప్రపంచం తనమీద తల్లకిందులుగానిల్చున్నట్టుంది. ఇహ చచ్చిపోదామన్నంత నిరుత్సాహం పుట్టడంలో ఆశ్చర్యమేముంది? తనోబోనులోపడ్డాడు, ఆ సంగతి ఆలస్యంగా తెలుసుకున్నాడు. యేం చెయ్యడం?

అతను లోలోపల అనుకున్నాడు, తానీ జన్మలో ఇంకో ఉదాత్తమైన రచన చెయ్యలేడు. తను ఇవ్వగలిగిన సందేశమేమీ లేదు. గొప్ప కళాకారుడిగా తనని ఆదరించిన ఈ ప్రజ తనప్రతిభ చచ్చినతర్వాత ఏంచేస్తుంది? తనపేరుతో ఓమనిషి ఉన్న సంగతే మరిచిపోతుంది, లేదా ఏం జరగనట్టు తనలో కళ శుష్కించిపోయినప్పటికీ మునుపటిమాదిరే గౌరవిస్తుంది. ఆ గౌరవమే తను భరించలేదు; అందులో అసహ్యమైన కపటం, శూన్యతా, ప్రపంచపు మౌఢ్యం కనపడతయ్. తను ఆర్జించిన కీర్తికూడా తన బాధనీ నిరాశనీ ఎక్కువచేస్తోంది. పూర్వం, తనకింతపేరులేనప్పుడు ఏరోజు బతుకు వెగటనిపించినా నదిలో పడిపోదామనుకునేవాడు. ఇప్పుడామాటే తలపెట్టకూడదు. ప్రపంచం పెద్ద సర్చిలైట్ వేసిచూస్తోంది తన జీవితాన్ని. తన ఆత్మహత్యా, పరాజయం ఇప్పుడు తనవికావు; విఖ్యాత రచయిత చార్లీ డెస్పార్డ్‌వి.

తన ఇప్పటిదురదృష్టంతో పోల్చిచూసుకుంటే ఈ తగులాటలన్నీ చిన్నచిన్న విషయాలే. ప్రపంచంమ్మీద తనకెన్నడూ పెద్ద సదభిప్రాయం లేదు. అవసరమైతే ఏ క్షణంగాని తన పాఠకలోకాన్ని స్నేహితుల్ని పెళ్ళాన్నీ అందర్నీ ఏ కించిత్ బాధాలేకుండా వొదిలెయ్యగలడు. అన్నిటికన్న ముఖ్యం దేవుడూ తనూ ముఖాముఖీ చూసుకోగలుగుతూ స్నేహితంగా ఉండడం. కాని ఇప్పుడు దేవుడు తననించి ముఖం తిప్పేసుకున్నాడు. తన క్రాంతదర్శిత కడతేఱిపోయి, తన కళాహృదయం కాలిపోయి దేవుణ్ణి ఎలా సమీపించగలడు? ఏ నోటితో తన తరణం కోరగలడు? నిజంగా. తనకీ సామాన్యులకీ తేడాలేదు. తను ప్రపంచాన్ని మోసపుచ్చవచ్చు మీరు నేనూ

వేరేనని. కాని తనని తాను ఎలా మోసపుచ్చుకుంటాడు? దేవుడికీ తనకి ఈ జీవితంలో తీరిపోయింది.

చార్లీ తీవ్రంగా ఆలోచించాడు నడుస్తూనే. ఆలోచనల వెంటనే అనేక అభినవదుఃఖాలు, నవ్యసాహిత్యంమీద తన మామగారి విమర్శ గుర్తుకొచ్చింది, "అంతా పైపై మెరుగులు. ఈయుగం ఉండే దాని ఆలోచనకి బరువులేదు, లోతులేదు. పైకి ఉదాత్తంగా కనబడడం, లోపలంతా ఉత్తడొల్ల. ఇదీ దాని లక్షణం." ఇంతకుపూర్వం తన మామగారి అభిప్రాయాల్ని ఎప్పుడూ లెక్క పెట్టలేదు తను. కాని ఈ సమయంలో తెలిసొస్తోంది వాటి నిజం బాధాకరంగా.

రాత్రి విపరీతమైన చల్లగా వుంది. పల్చని పదునైన గాలి తాకుతోంది అతన్ని. ఆకాశంవేపు చూసివర్షమొస్తుందని తేల్చుకునిత్వరగా అడుగులు వేశాడు చార్లీ. హోటలు చేరుకున్నాక ఓ గ్లాసు బ్రాందీ తీసుకోవాలి. మనస్సు ఊరటకోసం అతనామధ్యనే అలవాటుచేసుకున్నాడు బ్రాందీ తాగడం. ఒక్కొక్కప్పుడు ఏదో ఉపశమనం కలిగినట్లనిపించేది, కొన్నిసార్లు అదీలేదు ఎంత తాగినా. తన భార్య యీపాటికి నిద్రపోతూంటుంది తనకోసం ఎదురుచూసిచూసి. ఆమె తలుపు గడియవేసుకోకుండావుంటే ఎంతబావుణ్ణు! అప్పుడామెను మేల్కొలిపి మాట్లాడాల్సిన అవసరం ఉండదు. అందమైన ఆమె సాన్నిహిత్యంలో కొంత శాంతి చిక్కుతుంది తనకి. తనని ఆమె మనసారా ప్రేమిస్తుంది, అక్షరాల ఆరాధిస్తుంది. అయితే ఆమె పెళ్ళాడింది తననికాదు, ఆమె ఊహల్లో నిండువ్యక్తిత్వంతో నిలిచిన ఇంకో చార్లీని. తనకు చోటులేదు బయట జిల్లుమనే చల్లని ఆకాశం కిందతప్ప.

అతను హోటలుచేరుకుని, బ్రాందీతాగాల్సిన అవసరం లేదనుకున్నాడు. సమాధిని స్తబ్దత సంచారంచేసే హాల్లో ముసలిసేవకుడొకడు మగతగా ముందు కొచ్చి సూట్‌కేసే అందుకోబోయాడు. చార్లీకి తన బరువు తనే మోసుకోవడం మంచిదనిపించింది, తన భార్యనిగురించి అడిగాడు. లారా క్షేమంగానే అక్కడికోరోజు ముందు వచ్చిందని తెలుసుకుని, ఏ గదిలో దిగిందో అడిగి ఆలోచిస్తూ మెట్లెక్కడం మొదలెట్టాడు.

అతనికి ఆశ్చర్యంగా ఆ గదితలుపు గడియవేసిలేదు. తలుపుతోసి లోపలికిపోతూ అనుకున్నాడు, చాలానాళ్ళయింది తనమీద విధి ఈమాత్రం ఆదరం చూపించి అని. గది చాలవరకు చీకటిగా వుంది, ఓమూల బలహీనంగా వెలుగుతున్న గాస్ జెట్, గాలిలో బరువుగా తేలుతూ వయొలెట్ పూల బరిమళం. లారా తనకోసమని తెచ్చివుంటుందా పూలని, కాని తను రావడం ఆలస్యమై ఇపుడు నిద్రపోతూందామె. నిజంగా అదృష్టమంటే ఇదే. అతనికి పడుకున్నాక నిద్దరపట్టలేదు. ఎక్కడో గోడగడియారం గంటలుకొడుతోంది. నిద్రపోవడం ఓ కళ. తను దాన్నికూడా కోల్పోయినట్టున్నాడు. తనకిజీవితమంతా జాగరమేమో? తను చచ్చిపోయాడు. చావుబతుకులకి తన విషయంలో భేదం లేదు. అందుకనే తనకి నిద్దర రాదు.

హఠాత్తుగా అతని ఆలోచనలు ఆగిపోయినై. ఎవరివో అడుగుచప్పుళ్ళు క్రమంగా దగ్గిరకొచ్చి వాళ్ళ గదిదగ్గర నిల్చినయ్, ఆ తరవాత మెల్లగా తలుపుతోయబడింది తను పడుకునేముందు లోపల గడియవేశాడు. బయటనెవరో కాని ఈ సంగతి తెలుసుకున్నాక మళ్ళీ తొయ్యలేదు, మంద్రంగా వేళ్ళకణుపుల్తో తాళంవెయ్యడం మొదలెట్టాడు. కాసేపు ఊరుకుని సన్నగా ఈలలోకి దిగాడు. చార్లీ ఈగొడవకి తనభార్య మేల్కొంటుందేమోనని భయపడ్డాడు. పక్కమీంచి లేచి మునివేళ్ళమీద సద్దుకాకుండా నడుస్తూ వెళ్ళి నెమ్మదిగా తలుపుతీసి చూశాడు.

కారిడార్లో వెలుగులో స్పష్టంగానిల్చునివున్న అందమైన పొడుగాటి యువకుడు. అతన్నిచూడగానే చార్లీ ఒక్కసారిగా దిగ్భ్రమచెందాడు, ఎందుకింత ఆనందం ఇతనిముఖంలో? పౌర్ణమనాడు నది అలల్ని ఆవరించుకునే నిండైన మెత్తని వెన్నెలలా విస్తరించిన ఇంత ఆనందం తను ఎక్కడా చూళ్లేదు. స్వర్గంలోగాని సాధించొచ్చునా ఇంత సంతోషం? చార్లీ ఒళ్ళంతా కళ్ళుగా కళ్ళార్పకుండా ఓ నిముషంసేపు చూసి, చివరికి తెలివినిపడి అన్నాడు, "ఏంకావాలి? నా భార్య నిద్దరోతోంది. నేనూ నిద్రపోవాలనుకుంటున్నా."

చార్లీని చూసి ఆ యువకుడుకూడా అంతగానే

ఆశ్చర్యపడ్డాడు. అతని ముఖకవళిక నెమ్మదిగా మారింది. అప్పటికీ రేఖామాత్రంగా వెలుగుతూ విచిత్రమైన ఆతని ఆనందం చార్లీకి కనపడుతూనే వుంది. "క్షమించాలి. మీకు నిద్రాభంగం కలిగించినందుకు నాకు విచారంగావుంది. నే పొరబాటు పడ్డాను," అతను వెనుదిరగ్గానే చార్లీ తలుపు వేసుకున్నాడు, కంటికొసలోంచి తన భార్య మత్తుగా లేవబోవడం గమనించి "ఏంలేదు. ఎవరో పెద్దమనిషి. తాగివుంటాడనుకుంటా" అన్నాడు. ఆమె మళ్ళీ పడుకుంది.

వెన్నువాల్చగానే చార్లీ హృదయం అంతా కల్లోలితమైంది. తనకు తెలియనిదీ, ఏవిధంగానూ తను ఆపలేనిదీ ఏదో జరిగినట్టు అతను చలించిపోయాడు. కళ్ళముందు ఒక్కమారుగా కోటిసూర్యుళ్ళు తారకలూ వెలిగి ఆరిపోయి తనని గుడ్డివాణ్ణిగా చేసి వదిలేసినట్టయింది. ఆ తరువాత నెమ్మదిగా జ్ఞానోదయమై అందులో మెరుపు కొట్టినట్టు బాధాదళితమైంది హృదయం.

జీవితానికి అర్థం, ఆదర్శం, ఔన్నత్యం ఇక్కడే వున్నయ్. ఆ యువకుడి మొహంమీద మెరిసిన అనంతానందానికి మార్గంవుంది. అదా యువకుడికి తెలుసు, కాని తనకంతా అంధకారం. ఒకప్పుడు తనకీ తెలుసున్నట్టనిపించింది, చేతుల్లోంచి జారిపోయింది. "ఓ దేవుడా! ఏ అభాగ్య క్షణాన నాజీవనపథం ఆ యువకుడిమార్గనించి చీలిపోయింది?" అని ఆక్రోశించాడు చార్లీ.

తనకిప్పుడు స్పష్టంగా తోస్తోంది, ఇన్ని వారాలూ తనని వెంటాడిన దిగులు ఈ క్షణాన తాననుభవించే నరకానికి సూచకంఅని. ఏది, ఎక్కడతనకు ఉపశాంతి? విమర్శకులు వినువీధి కగ్గిస్తూరాసిన సమీక్షలా? ఛీ! అతని మనస్సు ముకుళించుకుపోయింది ఆ తలంపుతో. నాశనమైనదల్లాతనే. తనని మెచ్చుకునే ప్రజలు, విమర్శకులు, తనపెళ్ళాం వీళ్ళందరికోసం తను పుస్తకాలు రాయాలి, తన మానవత్వాన్ని వీళ్ళు అచ్చుకాగితాల్లో చూడాలి. వీళ్లలో ఏముందని తను ఇంతకాలం వ్యామోహంతో కొట్టుకులాడాడు? వీళ్లకి తన ఆత్మని ఎందుకు అమ్ముతున్నాడు? వీళ్ల గౌరవమే తనకుశిక్ష. "నన్ను వీళ్లు మనసారా ద్వేషించేట్టు చేస్తా"ననుకున్నాడు చార్లీ. దేవుడు తననించి ముఖంతిప్పుకున్నాడంటే అక్కజమేముంది? అతని సృష్టిలోని వస్తువులన్నిటినీ-వెన్నెల, సముద్రం, స్నేహం, కలహం, అన్నీ-వాటిఉదాత్తతనీ తను పొడిమాటల్లోనే చూసుకుంటున్నాడు. విమర్శకులూ లోకం ప్రాణంలేని తనమాటల్ని మెచ్చుకుంటూంటే, ఇందాక తను చూసిన యువకుడి జీవనపథం విశాలంగా నిశ్చింతగా వెలుగులోకి విస్తరించుకుంటూ పోతుంది.

అతనెంత సేపలా పడుకున్నాడో అతనికే తెలియదు. తను ఏడ్చానని అనుకున్నాడతను, కాని కళ్లల్లో తడిమాత్రంలేదు. చివరికల్లాగో ఒక నిముషం నిద్రపోయాడు. మెలుకువొచ్చి అతను శాంతంగా నిర్ణయించుకున్నాడు; తను ఇవన్నీ విడిచి వెళ్ళిపోతాడు, ఆనందాన్ని అన్వేషిస్తాడు విశ్వవృక్షం చిటారుకొమ్మల కెగపాకుతాడు. అతనింకోగంట అలాగేపడుకుని తరవాత నెమ్మదిగా తననిచుట్టినభార్యచేతిని వదిలించుకుని లేచాడు. నిశ్శబ్దంగా తనసూట్ కేస్ సర్దుకున్నాడు. తను రాస్తూన్న పుస్తకం మొదట వదిలేసిపోదామా అనుకుని తరువాత సముద్రంలో విసిరేసి దాని అంతంచూడటమే బాగుంటుందని దాన్నికూడా పెట్టెలో తోశాడు. గదివొదిలి వెళ్లబోతూ అతను తనపెళ్ళాన్నిగురించి ఆలోచించాడు, నిశ్చలంగా నిద్రపోతూన్న ఆమెనించి ఏవిధంగా సెలవు పుచ్చుకోడం? చివరికో కాగితంతీసుకుని రాశాడు; "నేను వెళ్ళిపోయాను. నీకు చాతనయితే నన్ను క్షమించు" అని.

బయట గాలివిసురు తగ్గిపోయింది, వర్షం కురుస్తోంది. తనకన్నివేపులా కూర్మిగా గుసగుసలాడుతూ కుండలతో కుమ్మరించినట్లు జడివాన. అతను తనటోపీ తీసేశాడు, క్షణంలో తలంతా తడిసిముద్దయింది. ముఖంమీంచికారే వాననీళ్ళ చల్లని అనుకోని స్పర్శలో అర్థంవుంది. అతనికిప్పుడనిపించటం లేదు ప్రపంచంలో తను ఏకాకిగా ఉన్నట్టు. చెదరిన చిక్కిపోయిన విశ్వశకాలాలు కుదురుకుంటూ రూపుదాలుస్తున్నయ్ ఆ విశ్వరూపం పిడికిట్లోవుంది తనవ్యక్తిత్వం.

అనుకుంటూనే హార్బరుకొచ్చి వార్ఫుమీద నిలబడి కిందనీళ్లల్లోకి చూస్తున్నాడు. చీకట్లు చిమ్ముతూ లోతుగా కల్లోలిస్తూన్న నీళ్లు. దాని మీద పాముపిల్లల్లా పరిగెడుతూ హార్బరు దీపాల కాంతులు. అతను ఓడలవంక చూస్తూ అక్కడే

చాలా సేపు నిల్చుండిపోయాడు. ఆర్ద్రమైన చీకటి రాత్రిలో నిర్భయంగా నీళ్ళమీద తేలే ఓడలు. వాటిల్లో ఒకదానిమీద తను వెళ్ళిపోతాడు. హఠాత్తుగా అతనికనిపించింది, ఈ ఓడలు తన కేదో సందేశం ఇస్తున్నయ్. ఏమిటది? అవును, అంతశూన్యం, ఒక్కమాటలో. ఓడలు నీళ్ళ పైపైనే తిరుగుతేయ్, నీళ్ల అడుక్కిపోవటం వాటికి ప్రమాదం. ఓడలోపలంతా డొల్ల. వాటి శక్తి అందులోనేవుంది. అవి డొల్లగా ఉన్నంత కాలం సముద్రం వాటిని తన అలలమీద మోస్తుంది. చార్లీ ఒక్కసారి గట్టిగా నవ్వాడు. అతన్ని ఓ విచిత్రమైన ఆత్మతృప్తి అలలావచ్చి ముంచెత్తింది. తరవాత నిశ్చయించుకున్నాడు, "నాజీవితం ఇంతవరకూ మాటల్లోగడిచిపోయింది. ఇవాళరాత్రి ఈ నిశ్శబ్దంలోనే ప్రపంచ వాస్తవాన్ని కనుక్కోగలిగాను. ఇకనించి నేను మాట్లాడను. దేనిఅంతరార్థాన్నిగాని తెలుసుకో ప్రయత్నించను" తనూ ఓడలికి మల్లేనే పైపైనే వుండాలి, అడుగంటూలనుకుంటే అక్కడికాఖరే. "ఎప్పుడూ సముద్రంమీద తిరుగుతూ ఈ ఓడల్ని నడిపే నావికులమాటలు వినాలి; వాళ్ళకి తానో నిమిషంకింద కనుక్కున్న విశ్వరహస్యం ఏనాడో తెలుసు. నిజంగా తెలివిఅంటే వాళ్లదే" అనుకున్నాడు చార్లీ.

"మీరు ఓడకోసం ఎదురు చూస్తున్నారనుకుంటూ నేం?"—ఎవరో నావికుడిలాగా ఉన్నతడువచ్చి పల్కరించాడు. చార్లీ "అవు"నన్నాడు.

"ఏఊరెళ్ళే ఓడ?"

"ప్రళయకాలంలో నోవాఎక్కలేదూ? అది" అందామనుకుని మళ్ళీమనసు మార్చుకున్నాడు, "ఏదోఒకటి. ఇక్కడినించి వెళ్ళిపోవాలి"

నావికుడు నవ్వాడు, "మీరో ప్రయాణీకులన్నమాట. ఇందాకట్నించీ అలా నీళ్లలోకి చూస్తూనుంచుంటే దూకిచావడానికొచ్చారనుకున్నాను"

"ఏమన్నావ్? అవును. నేనుదూకితే నన్ను రక్షించేవాడివనుకుంటూ. కాని నువ్వు నిన్న రావాలిసింది. నేన్నిన్న ఎందుకు చావలేదో తెలుసా? నాదగ్గిరప్పుడు నీళ్లులేవు. చూడు నీకు కావాలన్నప్పుడు ఏదికాని దొరకదు. ఇవాళిక్కడ నీళ్లున్నయ్. ఏంలాభం? నాకు చావాలనిలేదు. కాబట్టి చెప్పొచ్చిందేమిటంటే మహాకవులుకూడా పొరబాట్లు చేస్తారనీ, అందుకనే ఎవడూ కవిత్వం రాయకూడదనీ."

"ఏడేవడో చిత్తుగా తాగినబాప"తని తేల్చేసుకున్న నావికుడు "సరేనువ్వు చావకూడదని నిశ్చయించుకుంటే మంచిదే. నేపోతున్నా" అన్నాడు.

చార్లీకొంచెం చిన్నబుచ్చుకున్నాడు, సంభాషణ సరిగా సాగడం మొదలెట్టగానే ఇతనెవరో వెళ్ళిపోతున్నాడేనని. "నేనురావచ్చునా నీతో?" ఆ నావికుణ్ణి వొదలదలుచుకోలేదు అతను.

"నీయిష్టం. ఇక్కడే ఓ కొట్టుకి రం తాగడానికి పోతున్నా" అన్నాడు నావికుడు.

"ఎంతమంచి ఉద్దేశం! నేనూ వస్తున్నా" చార్లీ వెంటబడ్డాడు.

అక్కడింకా యిద్దరు నావికులు కలిశారు. చార్లీ వాళ్లకి రం పోయించి తను కాఫీ తీసుకున్నాడు. అతనిలో ఆగాచుకోలేని ఉద్రేకం, వాళ్ల అనుభవాలు వినాలని దహించుకుపోయే ఆసక్తి. ఆవేశంతో తెల్లగా పాలిపోయిన అతని మొహంచూసి ఒకడన్నాడు. "మీకు ఒంట్లో బాగున్నట్టులేదు" అని.

"అదికాదు. ఈ మధ్యనాకుచాలా సంతాపం కలిగించే సంగతొకటి జరిగింది. మీతోమాత్రం చెపుతున్నా. నాకో పెంపుడుకోతి ఉండేది. దాని పేరు చార్లీ. తోబుట్టినవాడిలాగా చూసుకునేవాడిని. మాలోమాకు రహస్యాలు లేవు, నా ఆలోచనలన్నీ దానికితెలుసు. అల్లాంటికోతి మొన్ననే ఈదేశంనీళ్ళు సరిపడక నా ఒళ్ళోనే చచ్చిపోయింది. ప్రపంచంలో నువ్వుప్రేమించిన వస్తువొక్కటేవుండి అదినీకు వేరయితే ఎలా వుంటుంది? నేమటుకు ఈ విపత్తుకి తట్టుకోలేకపోయానుసుమీ" అన్నాడు చార్లీ. వాళ్ళు తమ విచారం వెలిబుచ్చారు.

వాళ్ళు భయంకరమైన తమ సముద్రానుభవాలు కథలుగా వర్ణించారు. చార్లీ అవన్నీ శ్రద్ధగావిని అనుకున్నాడు. "నిజమైన ప్రేమికులు వీళ్ళే, ఇన్ని అవస్థలుపడి కూడా మళ్ళీ ఓడలెక్కి తిరుగుతున్నారంటే సముద్రాన్ని ఎంతగానో ప్రేమించి ఉండాలి. ఇదే సిద్ధాంతం మనుష్యులికీ వాళ్ల పెళ్ళాలికీ ఎందుకుకన్వయించ

కూడదు? వీళ్ళముందు నేను శిశువుని, మూర్ఖుణ్ణి, ఎంతయినా నేర్చుకోవాల్సి ఉంది నేను వీళ్ళ నించి."

గ్లాజులు ఖాళీ అయినప్పుడల్లా రం నిండు తోంది, శ్రద్ధగా తను కథలు వింటున్నాడు: వాళ్ళకి చార్లీమీద బాగా స్నేహాదరాలు కుది రాయి. కాస్సేపయినాక వాళ్ళల్లో ఒకడు ఇంటి దగ్గిరున్న తన పెళ్ళాన్నీ పిల్లల్నీ తలుచుకుని క్షేమగా మాట్లాడాడు. ఇంకోడు అదే వూళ్ళో వేరే హోటల్లో సారాపోసే ఆడవాళ్ళిద్దరికి తన మూలాన కవలపిల్లలు కలిగిన విషయం గర్వంగా చెప్పాడు. చార్లీ తన పెళ్ళాన్ని తలుచుకుని సిగ్గుపడ్డాడు. ఈ నావికులకి తమ ఆడవాళ్ళతో ఎలా మెలగాలో బాగా తెలుసు, తనకి మల్లే రాత్రికి రాత్రే పెళ్ళాన్ని వొదిలేసి వీళ్లల్లో ఎవడూ పారిపోడు. తనుచేసినపని చెబితే వీళ్ళ అభిమానం తగ్గిపోతుంది నిస్సందేహంగా.

వాళ్ళతో మాట్లాడుతూ తను బాలుణ్ణి అను కున్నాడు. అదే ప్రమాణంలో తనభార్యఇప్పుడు తనతల్లిలా, తనని కాపాడే దేవకన్యలా కనపడు తోంది. గతానికి వర్తమానానికి మధ్య కదిలి ఆడుతూన్న హృదయం. తనముందు సముద్రం, ఓడలు, అతిలోక ఆనందం అలుముకున్నా యువ కుడి ముఖం తనచుట్టూ ఎన్నో విధాల ఎన్నో రంగుల దృశ్యాలు. ఈ సారాకొట్లో తను జీవితానుభవాలు విన్నాడు, వింటూ తను అను భవించాడు. నావలో నానాకష్టాలుపడి చివరికి కళాసీ కొంపచేరుకుంటాడు. అతని పెళ్ళాం అతని పిల్లలూ ఆకర్షిస్తారతన్ని, ఉన్నట్టుండి చార్లీ తనభార్యని తలుచుకుని జాలిపడ్డాడు; నిశ్చింతగా నిద్రపోయే ఆమె అందం, ముఖం మీది శాంతీ అతన్ని కలతపెట్టినవ్. తనురాసిన ఉత్తరం గుర్తుకొచ్చి చెక్కిలికి ఎగదన్నిన ఎఱ్ఱ దనంతో తనని తను దూషించుకున్నాడు. భూమి మీద స్వర్గంలేదు, నరకంలేదు ఉన్నది భూమే. అతను బల్లమీదచిందిన కాఫీని చూస్తున్నాడు. నావికులు మాటలు కట్టిపెట్టారు, తమ మిత్రు డాలోచిస్తున్నాడని వాళ్ళు గమనించారు.

తెములుచ్చుకుని బయటకొచ్చేసరికి తూరుపు తెల్లబడుతోంది. దూరదూరంగా వీధిలో దీపాలు నిస్తేజంగా, గాలిలో సానుతాపంగా నిల్చు న్నాయ్, అతను రెండడుగులు వేశాడో లేదో అంతవరకూ ఆ కొట్టుముందరే ఇటూ అటూ తిరుగుతున్న ఒక బక్కపల్చని యువతి చకచకా వచ్చి కలుసుకుని ఏదోభాషలో పలకరించింది. అతను జవాబివ్వకుండా నడిచిపోతూంటే మళ్ళీ ఇంగ్లీషులో ఆహ్వానించింది. చార్లీ ఆగి ఆమె వేపుచూశాడు. జేబులో చూసుకుంటే ఒక షిల్లింగు మాత్రంవుంది. అనుద్రేకంగా ఆమెను దగ్గిరికి లాక్కుని ఒకసారి ముద్దుపెట్టుకుని షిల్లింగు చేతిలో పడేసి ఉదుటుగావదిలి వెనక్కి తిరిగి చూడకుండా నడిచాడు.

ఆంట్ వెర్ప్ మెలమెల్లగా మేలుకుంటోంది. క్వీన్స్ హోటలు కిటికీల్లో ఇంకా దీపాలు వెలుగు తున్నయ్. హాల్లో ఎవరూ కనపడ లేదతనికి. మెట్లెక్కబోతూ ఆ పక్కనే వున్న ఇంకొక గదిలో తనభార్య కూచుని వుండడం చూసి అటు పోయాడు.

అతన్ని చూడగానే ఆనందోజ్జ్వలమైంది ఆమె ముఖం.

"ఇంత ఆలస్యమయిందే నువ్వొరావడం?" ఆమె చేతిని ముద్దుపెట్టుకోబోతూ అతనాగి పోయాడీ ప్రశ్నకి.

"నేను ఆలస్యంచేశానా? ఇప్పుడు ఏడూ పదేగా అవుత?" గడియారం వేపుచూస్తూ అన్నాడు.

"అవుననుకో, కాని ఇంకా ముందొస్తావను కున్నాను."

చార్లీ కుర్చీలో కూలబడ్డాడు. అతలికేమ నాలో తోచడంలేదు. ఏమీ జరగనట్టుగానే ఇలా తనని మళ్ళీ స్వీకరించడానికి ఎంత ఆత్మ బలముండాలి తన భార్యకి?

అతను తనభార్యని చూస్తూ అనుకున్నాడు, "ఈమె ఒక దీపస్తంభం, తుపాను ధిక్క రించి రాజసంగా నిలబడుతూ నలుదిశలకీ జాలిగా వెలుగును విరబోసే దీపస్తంభం. అన్ని ఓడలికీ అపాయ ప్రదేశాల్ని తప్పించుకు తిరగడానికి సహా యపడే సౌమ్యజ్వాల."

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" ఆమె తన కళ్ళ ల్లోకి చూస్తోంది.

"నేనునిజం చెపుతాను అదే మంచిది" అను కుని చార్లీ "నా జీవితానికి నువ్వో దీపస్తంభాని

వనుకుంటున్నాను. భద్రంగా రేవు చేరుకోడానికి నాదోవని వెలిగించేదీపానివి," అన్నాడు.

ఓ క్షణం అతని వేపుచూసి మొహం తిప్పుకుంది, ఆమె కళ్ళల్లో నీళ్లు నిండినయ్. అతను భయపడ్డాడు, ఇంతవరకూ ధైర్యంగా ఉన్న తన భార్య ఇహ ఏడుస్తుందేమోనని. "మన మిద్దరం పైకి పోదాం మనగదిలోకి" అన్నాడు చార్లీ, తామిద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు ఉన్న విషయం చెప్పేద్దామనుకున్నాడతను.

నిన్నరాత్రి ఎక్కడానికంత శ్రమ అనిపించిన మెట్లు ఈ రోజు తేలిగ్గా ఎక్కిపోతున్నాడు తను.

"ఎక్కడికి? ఇంకా పైకిపోతున్నావు"... కారిడార్లో ఆమె ముందుదోవ తీసింది.

తమ గదిలో ముందుగా చార్లీ కనుక్కున్నది, వయొలెట్ పూల పరిమళం లేకపోవడం. నిన్న రాత్రి గాలిలో బరువుగా నిలిచిన సుగంధం ఏమయింది? కోపంలో తన భార్యవాటిని వీధిలో గావి పారేసిందా? ఆమెకు కోపంరావడం సహజమే తనురాసిన రెండు వాక్యాలూ చదివాక. లేక తను బయటికి నడవగానే ఆ పూలు కూడా ఉన్నట్టుండి వాడిపోయాయా? అతని నడుం చుట్టూ చేతులేసి గుండెలమీద తలవాల్చింది ఆమె. ప్రేమగా ఆమెని అదుముకున్న అతనికి హఠాత్తుగా అనిపించింది, తనున్నది ఈ గదిలో కాదు నిన్నరాత్రి. తను ఉత్తరం ఉంచినదల్లా, పడకా స్థానం మారినట్లు కనిపించినయ్. నిన్నటి గదిలో బెల్జియన్ రాజవంశం పటంలేదు, తన పడక్కి చాందినీలేదు. చార్లీ దీర్ఘంగా ఊపిరి పీల్చాడు.

"నిన్నరాత్రి ఈ గదిలోనే పడుకున్నావా నువ్వు?"

"అవును ఏం? కానినిద్దరపట్టలా నువ్వురాలేదని ఏదో గుబులుగా ఉంది."

"నీకు అనిపించలేదూ ఎవరూ లోపలికి కొచ్చినట్టు?"

"ఛా! నేను లోపల గడియేసుకు పడుకున్నాను. ఎవరూ తలుపుతట్టిన పాపాన కూడా పోలేదు."

గతరాత్రి అనుభవాలన్నీ ఒకటొక్కటే స్మృతికి తెచ్చుకుంటున్నాడతను. అంతా ఏదో కథలోకి మల్లే మూలమట్టుగా కదిలిపోయాడు. దేవుడు కల్పించిన కథానికల ముందు మానవులవి ఏపాటి? స్వర్గతృప్తి తాండవించిన ఆ యువకుడి మొహం, తనమీద మధువర్షంగా జల్లుమన్నాడు, తన పక్కలో ఆమె ఎవరు? తామర తూడుల్లాంటి చేతులు పెనేసి నిద్రలో అలసంగా అందిచ్చిన ఆమె రొమ్ముల ఒత్తిడి. అతను నిశ్చలంగా నిలుచుండిపోయాడు తన ఆలోచనల్లో. అతని భార్య మొహమెత్తిచూసి ఆశ్చర్యపోయింది. వేరేలోకపు వెలుగులు విరుస్తూ అందంగా తన భర్త ముఖంలో ఎంత ఆనందం!

"ఇప్పుడేం ఆలోచిస్తున్నావ్" అంది అమాయకంగా.

చార్లీ ఆమెనిగట్టిగా కౌగలించుకుంటూ అన్నాడు "ఇప్పుడు స్వర్గాన్నీ దేవతల్నీ గూర్చి ఆలోచిస్తున్నాను. రోమియో జూలియెట్, హీరోలియాండర్ వీళ్ళందర్నీ"

"అంటే ఏదో ప్రణయకథ రాయబోతున్నావన్నమాట, దొంగా?" అన్నది గోముగానవ్వుతూ. అతను వెంటనే జవాబివ్వలేదు. ఆమెని విడిచి "ఏమన్నావు" అన్నాడు పరధ్యానంగా ఆమె





*Enquiries to :*

# RECHLABS,

30, Alamelumangapuram,
MYLAPORE : : MADRAS-4
OR
550, 8th Main Road,
MALLESWARAM : : BANGALORE-3

కొంచెంపిరికిగా అన్నది, "ప్రణయకథేమన్నా రాస్తున్నావా అని అడిగాను,"

అతను వెళ్ళి మేజా కానుకున్నాడు. నిన్న రాత్రి తనమీద వాలిన కాంతి మళ్ళీవొస్తోంది అన్ని వేపులనించీ, తన దీపస్తంభంనించి కూడా. అయితే అప్పుడేమో అది వెలుపల అనంతవిశ్వం మీద అవరించుకుంది; ఇప్పుడు తన లోపల, గది నలుమూలల నాట్యమాడుతోంది. ఈ వెలుగులో తనని తాను చూసుకోవాలి, ఈ పరీక్షలో మేజా బల్లని ఆదుకోవాలి. అలా నుంచుని ఉండగానే దేవుడికీ అతనికీ దీర్ఘసంభాషణ మొదలెట్టింది.

దేవుడన్నాడు, "వినిపించుకున్నావో లేదో? నీ భార్య నిన్ను రెండుసార్లడిగింది ప్రణయ కథేమన్నా రాయబోతున్నావా అని. నిజం చెప్పు, రాస్తావా?"

"రాయవచ్చు. అది సంభవమే."

"అంతటితో తృప్తిపడతావా మరి?"

"భగవాన్! ఏమడుగుతున్నావు? నీకు తెలుసు నేనవునని చెప్పలేనని. మానవమాత్రుణ్ణి; నన్నంటి పెట్టుకుని నిరంతం కావలించుకునే ప్రేమకోసం అవశంగా నా కౌగిలిలో అణగే మెత్తని వెచ్చని ఆడదాని అందంకోసం పరికపించకుండా ఎలా రాయగలను ప్రణయకథల్ని?"

"నిన్నరాత్రి అవన్నీ నీకిచ్చాను. ఏం చేశావు నువ్వు? పక్కలోంచి ప్రపంచం పొలిమేరలకి పారిపోదామని బయలుదేరావు."

"నిజమే. నువ్వు చూశావుగా నేచేసింది, అది మంచిదే నంటావా? నా జీవితంలో మళ్ళీమళ్లీ అవే సంఘటన్ని తెచ్చిపెడతావా? నాకు చెప్పు ఏమయిందామె? తన భర్తయిన ఆ యువకుడికి ఎలా సర్దిచెపుతుంది ఆమె నే రాసిన ఉత్తరం మాటేమిటి? అది ఎవరుఎవరికి రాసినట్టు? అంతా గగ్గోలుగా ఉంది."

దేవుడూరికే "అవును" అన్నాడు. మిగతా ప్రశ్నలకి జవాబులేదు.

"ఇదిగో కరాకండీగా అడిగేస్తున్నాను. ఆడ వాళ్ళ అందాన్నిగూర్చి రాసేనాకు వాస్తవ జీవితంలో వాళ్ళనించి పిల్లింగు విలువ ఆనందమేనా వచ్చేది చెప్పు."

దేవుడు మళ్ళీ "అవును నువ్వంతతో తృప్తి పడాలి" అన్నాడు.

చార్లీ మాట్లాడలేదు, బల్లమీద వేలితో పిచ్చి గీతలు గీస్తున్నాడు.

దేవుడందుకున్నాడు, "ఓడల్ని ఎవరు చేశారు చార్లీ?" అని.

"నాకు తెలియదు. నువ్వు చేశావా?"

"ఆ, నేనే, తేలే ఓడల్ని, ఆకాశాన్ని ఈదే చందమామని, సముద్రం ఆటూపోటూ, తరతరాల మానవుల్ని అన్నీ నేనే చేశాను. నిన్నుచూస్తే నవ్వొస్తోంది, ఇంత ప్రపంచం ఉండగా నీ జీవిత నౌక క్వీన్స్‌హోటలుగదిలో మెట్టుపట్టింది. భార్య మీద నిష్కారణంగా అనాదరం తెచ్చుకున్నావు."

చార్లీ వింటున్నాడు.

"ఏం మాట్లాడవు? నీకు పుస్తకాల్లో రాయడానికి తగినంత మంచి బాధలు కల్పించను. బాగుందా?? నీచేత రాయించేదెవరు? నిన్ను మెచ్చుకునే ప్రజలు కాదు, విమర్శకులు కాదు, నీ పెళ్ళాం కూడా కాదు; నేను."

"నాకా నమ్మకం ఎప్పుడూ ఉంటుందా?"

"ఎప్పుడూ ఎలావుంటుంది? ఒక్కొక్కప్పుడు మరిచిపోతావు. అప్పుడే మన సంభాషణ గుర్తు తెచ్చుకోవాలి నువ్వు. మరి నిన్నరాత్రి అనుభవానికి నాకు కృతజ్ఞుడివిగా ఉంటావా?"

"ఆమాటెందుకు? అక్కడికలా వొదిలేద్దాం" అన్నాడు చార్లీ.

లారా వెళ్ళి కిటికీ తెరిచింది. పచ్చిగా చల్లని ప్రభాత వాయువు, వీధిలోబలపడుతూన్న సందడి లోపలికి వచ్చినయ్. చార్లీ వీధిలోకి చూస్తూ నుంచున్నాడు. బూడిదరంగు పులిమినట్లున్న పట్నం మీద ఉదయవర్ణాలు సున్నితంగా తీర్చుకుంటున్నయ్.

"దేవుడికి ఒకందుకు నా కృతజ్ఞత చూపెడతాను. నా సోదరుడిలాంటివాడు; రాత్రి కనిపించిన యువకుడికి నేను ఎలాంటి ద్రోహం చెయ్యలేదు, చెయ్యగలిగిన పరిస్థితుల్లో కూడా."

అలాగే కిటికీ దగ్గిర నిల్చుని ఆశ్చర్యపోయాడు, ఉదయకాంతులు వెలిగించిన విశాల విశ్వంలో తన ఆనందదూత తన సోదరుడా యువకుడెక్కడ ఉన్నాడు?

—(ఇసాక్ డెనిసెన్ ఆధారం)